ప్రజాశక్తి

శుక్రవారం 15 ఆగస్టు 2025

8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

పెరుగుతున్న వరద

- అధికారులు అప్రమత్తం
- పొంగుతున్న వాగులు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- నీట మునిగిన పంటలు
- బ్యారేజీకి క్రమంగా తగ్గుదల

... వార్తలు లోపలి పేజీల్లో



నందిగామలో నల్లవాగు పొంగి నిలిచిన రాకపోకలు



జగ్గయ్యపేట షేర్‌మహ్మద్‌పేటలో చెరువు పొంగడంతో చేపలు పడుతున్న ప్రజలు



బంటుమిల్లిలోని జగనన్న కాలనీలో వర్షం నీరు

నేడు 'స్త్రీ శక్తి' ప్రారంభం



బస్టాండ్‌లో సిద్ధమవుతున్న వేదిక

- విజయవాడలో ప్రారంభించనున్న సిఎం చంద్రబాబు
- ఐదు వేల మంది మహిళల తరలింపునకు ఏర్పాట్లు

వార్త 2లో

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు

సర్వం సిద్ధం

- రాష్ట్రస్థాయి వేడుకలకు స్టేడియం ముస్తాబు



వార్త 2లో

నేడు 'స్త్రీ శక్తి' ప్రారంభం

- విజయవాడలో ప్రారంభించనున్న సిఎం చంద్రబాబు
- ఐదు వేల మంది మహిళల తరలింపునకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయవాడ, కృష్ణా ప్రతినిధి

అధికారంలోకి వచ్చిన 15 నెలల తర్వాత కూటమి ప్రభుత్వం మరో ఎన్నికల హామీ అమలుకు పూనుకుంది. దీనిలో భాగంగా నిర్ధేశించిన ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించడానికి స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభిస్తోంది. శుక్రవారం సాయంత్రం మూడు గంటలకు విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు పథకాన్ని ప్రారంభించనున్నారు. పిఎన్ బస్‌స్టేషన్ ప్రాంగణంలోని సిటీ టెర్మినల్ ఆవరణలో సభా వేదికను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ నేతృత్వంలో పలు శాఖలకు చెందిన అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. సుమారు ఐదు వేల మంది మహిళలను ఈ కార్యక్రమానికి తరలించనున్నారు. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలను సైతం దృష్టిలో ఉంచుకుని వేదికను సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆయా డిపోల వారీగా స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పథకాన్ని ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

ఎన్‌టిఆర్ జిల్లాలో 65 శాతం సర్వీసులు

స్త్రీ శక్తి పథకాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో అమలు చేయడానికి ఇప్పుడున్న సర్వీసుల్లో 65 శాతం అర్హత ఉన్న సర్వీసులు అందుబాటులో ఉన్నాయని ఆర్‌టిసి అధికారులు వివరిస్తున్నారు. ప్రస్తుతం ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా 780 సర్వీసులు కాగా వీటిలో విజయవాడ సిటీలో 280 సర్వీసులను నడుపుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఆరు క్యాటగిరీల వారీగా సర్వీసులు అందుబాటులో ఉన్నాయని వారు వివరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఒఆర్ 60 శాతం ఉందని, 80 శాతానికి పెరిగితే అప్పుడు సర్వీసులు ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోందని ఎన్‌టిఆర్ జిల్లా ప్రజారవాణా అధికారి యంవై దానం తెలిపారు.

కృష్ణాలోని ఐదు డిపోల్లో 309 బస్సులు

కృష్ణాజిల్లాలోని ఐదు డిపోల పరిధిలో 411 ఆర్టీసీ బస్సులు రోజువారీ 163 రూట్లలో 1,39,131 కిలోమీటర్లు తిరుగుతున్నాయి. 78,953 మంది ప్రయాణికులను రోజువారీ గమ్యస్థానాలకు చేర్చుతున్నాయి. 19,323 మంది మహిళలు, 59,165 మంది పురుషులు, 465 మంది ఇతరులు ప్రయాణిస్తున్నారు. రూ.48 లక్షలు ఆర్టీసీకి ఆదాయం సమకూరుతోంది. తాజాగా స్త్రీశక్తిలో పల్లెవెలుగు , అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డనరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచిత ప్రయాణానికి అనుమతిస్తారు. మచిలీపట్నం డిపోలో 71, అవనిగడ్డలో 70, గుడివాడలో 69, గన్నవరంలో 56, ఉయ్యూరు 43 చొప్పున మొత్తం 309 బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించడానికి జిల్లా యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ప్రజారవాణా అధికారి కె.వెంకటేశ్వర్లు తెలిపారు.



బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు డివి కృష్ణ, తదితరులు

వరద బాధితులకు సౌకర్యాలు కల్పించాలి

సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: పునరావాస కేంద్రాలతో పాటు వరద ముంపు ప్రాంతాల్లోని బాధితులకు కనీస సౌకర్యాలు కల్పించాలని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ కోరారు. ఇబ్రహీంపట్నం మండలం, కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఫెర్రీ వద్ద కృష్ణా పరివాహక ప్రాంతంలో వరద ఉధతి కొనసాగుతున్న నేపథ్యంలో సిపిఎం నాయకులు గురువారం పర్యటించారు. ఫెర్రీ పుష్కర కాలనీలో వర్షపు నీరు నిలవడంతో రోడ్లపై సామాగ్రిని ఉంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధితులతో మాట్లాడారు. ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామంలో నీట మునిగిన పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డివి కృష్ణ మాట్లాడుతూ ఫెర్రీ ఇసుక రేవులు, పుష్కర కాలనీ, గాజులపేట, ఖాజీమాన్యం, భీమరాజుగుట్ట, ప్రసాద్ నగర్, అనంత పద్మనాభ నగర్, జగన్ కాలనీల్లో వర్షపు నీరు అధికంగా నిలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పునరావాస కేంద్రంతో పాటు ముంపు ప్రాంతాలకు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఆహారం, మంచినీరు, వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు విఠల్‌రావు, మండల కార్యదర్శి ఎం.మహేష్, ఎస్‌కె బాషా, ఇ.కొండలరావు, నాగరాజు, పుష్కర కాలనీ వెంకటేశ్వరరావు, లక్ష్మీ కుమారి, రైతులు ఆర్ వెంకటేశ్వరరావు, బి సాంబశివరావు, ఎస్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ జిల్లాపై రూ.198 కోట్ల భారం ప్రభుత్వం భర్తీ చేస్తుందా?

ప్రజాశక్తి-విజయవాడ: స్త్రీ శక్తి పథకం అమలు వల్ల ఆర్టీసిపై పడే భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎలా భర్తీ చేస్తుందనే దానిపై ఒక స్పష్టత లేదని సంస్థలోని ఆర్టీసి యూనియన్లు, ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌టిఆర్ జిల్లాపై ఒక రోజుకు రూ. 55 లక్షలు, నెలకు రూ. 16.5 కోట్లు, ఏడాదికి రూ.198 కోట్ల మేర ఆర్టీసికి వచ్చే రాబడి తగ్గిపోతోందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్‌టిఆర్ జిల్లాలో 800 సర్వీసులు నడుస్తున్నాయి. ఒక్క విజయవాడ సిటీలోనే 350 సర్వీసుల వరకు నడుపుతున్నట్లు ఆర్టీసి అధికారులు వివరిస్తున్నారు. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా ఆర్టీసి సర్వీసులు రోజుకు 2 లక్షల 70 వేల కిలోమీటర్ల మేర నడుస్తున్నాయి. టికెట్ల రూపంలో ప్రయాణికుల వద్ద నుంచి రోజుకు రూ.1.10 కోట్లు రాబడి వస్తుందని ఆర్టీసి అధికారులు వివరిస్తున్నారు. అయితే ప్రస్తుతం జిల్లాలో మొత్తంగా 60 నుంచి 65 శాతం వరకు ఒఆర్ వస్తుందని, దీనిలో మహిళల శాతం 30 నుంచి 35 శాతం వరకు ఉంటుందని స్వయంగా ఆర్టీసి ఉన్నతాధికారులు వివరిస్తున్నారు. ఈ లెక్కన ఇప్పటి వరకు ఆర్టీసికి రోజువారీగా వచ్చే రాబడి, దానిలో మహిళలకు ఉచిత బస్సు పథకం ద్వారా కోల్పోతున్న సగం రాబడిని పరిశీలిస్తే...ఏడాదికి ఎన్‌టిఆర్ జిల్లాలోనే ఆర్టీసికి రూ.198 కోట్లు రాబడిని కోల్పోవాల్సి వస్తోంది. ఈ కోల్పోతున్న రాబడిని ఏమేరకు ఆర్టీసికి ప్రభుత్వం భర్తీ చేస్తుందనేది ప్రశ్నగా తయారయింది. విజయవాడ పాత బస్టాండ్ లాంటి రూ. 400 కోట్ల విలువైన ఆర్టీసి స్థలాన్ని లూలూ లాంటి కార్పొరేట్ కంపెనీకి దారాదత్తం చేస్తూ 137 జీవో విడుదల చేయడం, దానిపై రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసి సంఘాలు, పౌర వేదికలు భగ్గుమన్న విషయం తెలిసిందే. ఆర్టీసికి రావాల్సిన రాబడిలో సగంపైగా ప్రయివేటు హైయ్యర్ బస్సులకు ప్రభుత్వం కట్టబెట్టడం జరుగుతుంది. రోజు రోజుకు ప్రయివేటు వాహనాల తాకిడి పెరిగిపోతూనే ఉంది. అంతేగాక ప్రస్తుతం జిల్లాలో ఉన్న ఆర్టీసి సర్వీసులు 800 ఉన్నాయని అధికారులు వెల్లడిస్తున్నా వీటిల్లో సగంపైగా కాలం చెల్లిన సర్వీసులున్నాయని, ఉద్యోగులతో పాటు కార్మికులు వారి అనుభవాన్ని వ్యక్తం చేస్తున్నారు.మరొక వైపున ఈ ఉచిత బస్సు ప్రయాణం వలన ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఉపాధి దెబ్బతినే ప్రమాదం ఉందని ఇప్పటికే వారు పలు రూపాల్లో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్రమంగా తగ్గుతున్న కృష్ణా వరద

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి మరింత పెరిగింది. వరద ఉధృతి రీత్యా బ్యారేజి వద్ద రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. బ్యారేజి దిగువన ఉన్న లంక గ్రామాల ప్రజలను ఇరిగేషన్ అధికారులు అప్రమత్తం చేశారు. గురువారం మధ్యాహ్నం గరిష్టంగా ప్రకాశం బ్యారేజికి 5 లక్షల 65 వేల 807 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. బ్యారేజి వద్ద నీటి మట్టం 14.8 అడుగులకు చేరింది. దీంతో బ్యారేజికి చెందిన మొత్తం 70 గేట్లకు పూర్తిగా ఎత్తివేసి 5 లక్షల 65 వేల 201 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 606 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఆ తర్వాతకు బ్యారేజికి వరద నీరు క్రమంగా తగ్గుతూ వస్తోంది. సాయంత్రం ఐదు గంటలకు ఇన్‌ఫ్లో 5 లక్షల 52 వేల 640 క్యూసెక్కులకు తగ్గింది. రాతి 10 గంటలకు 4 లక్షల 96 వేల338 క్యూసెక్కులకు తగ్గింది. దీనిలో 4 లక్షల 93 వేల 822 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి, 2,516 క్యూసెక్కుల నీటిని కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 13.7 అడుగుల నీటిమట్టం కొనసాగుతోంది.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి ప్రాంగణాన్ని సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. త్రివర్ణ శోభిత వేడుకలకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. రాజకుమారి, డిప్యూటి కమీషనర్ ఆఫ్ పోలీస్ కె.వి.జి. లలిత, ప్రోటోకాల్ డైరెక్టర్ టి. మోహన్‌రావులు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారన్నారు.

విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు సిఎం చంద్రబాబు హాజరవుతున్నందున స్టేడియంలో ఎక్కడా ఎటువంటి లోపం జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆయా విభాగాల అధికారులను నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. బందర్ రోడ్ లో గల ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం, జవహర్లాల్ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్, వన్ టౌన్ హోల్డింగ్ ఏరియా ప్రాంతాలలను కమిషనర్ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్టేడియంలో స్వాతంత్ర్య వేడుకలను పూర్తి చేసుకుని సాయంత్రం మూడు గంటల సమయములో పిఎన్ బస్‌స్టేషన్ ఆవరణలోని సిటీ టెర్మినల్ ప్రాంగణంలో స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించడానికి సిఎం చంద్రబాబు హాజరవుతారని, అక్కడా కూడా ఏర్పాట్లు పూర్తి స్థాయిలోఉండాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.



అంగన్వాడీ టీచర్‌కు నివాళి

ప్రజాశక్తి-పామర్రు : పామర్రు మండలం కొండిపర్రు గ్రామం అంగన్వాడి సెంటర్-2. కు చెందిన కళ్ళేం వీరమ్మ (సరోజిని) (59) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు.ఆమెకు ఒక కుమారుడు ఉన్నాడు. ఆమె అకాల మరణానికి పామర్రు సిఐటియు మండల కమిటీ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆమె మృతదేహాన్ని జిల్లా సిఐటియు ఉపాధ్యక్షుడు ఓ. గంగాధర్ ప్రసాద్,ఇంటి రాజు, ఐసీడీఎస్ ప్రాజెక్టు నాయకులు కే ఉమారాణి,సువర్ణ లత, పామర్రు సెక్టర్ సూపర్వైజర్ ఎస్ విజయ్ కుమారి, అంగన్వాడీ టీచర్లు సందర్శించి నివాళులర్పించారు.

ఈసేవా కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా న్యాయ వ్యవస్థలో మరింత వేగం పెంచేందుకు విజయవాడలో 3, మచిలీపట్నంలో రెండు న్యాయ ఈ సేవ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి తెలిపారు. మచిలీపట్నంలోని రెండు న్యాయ ఈ సేవ కేంద్రాలను జిల్లా జడ్జి గోపి న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయ శాఖ సిబ్బంది, కక్షి దారులు, పోలీసు సిబ్బంది సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి గోపి మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ లో పైలెట్ ప్రాజెక్టుగా కష్ణ ,గుంటూరు, విశాఖపట్నం జిల్లాలలో ఈ సేవ కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సేవ కేంద్రాలలో ఉచితంగా కక్షిదారులకు న్యాయవాదులకు కేసుల పరిస్థితి, తదుపరి విచారణ తేదీలు ఇతర వివరాలను తెలియజేస్తారని తెలిపారు. న్యాయశాఖలో తర్ఫీదు పొందిన సిబ్బంది న్యాయ ఈ సేవా కేంద్రాలలో అందుబాటులో ఉండే విధంగా రెండు ఈ సేవ కేంద్రాలు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కష్ణా జడ్జి గాజుల వెంకటేశ్వరరావు, తొమ్మిదవ అదనపు జిల్లా జడ్జి, సీనియర్ సివిల్ జడ్జిలు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి. పోతురాజు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం : పారిశుధ్య కార్మికులకు సాయం చేయడం గొప్ప విషయమని కేసరపల్లి సర్పంచ్ చేబ్రోలు లక్ష్మి మౌనిక అన్నారు. మండలంలోని కేసరపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం, పుణ్యాచారిటీస్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు 40 మందికి నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ మాట్లాడే పెదవుల కన్నా సాయం చేసే చేతులు గొప్పవారన్నారు. సామాజిక సేవలో రోటరీ భాగస్వాములు కావడం వల్ల ఎంతో మంది పేదలకు సహాయమందుతుందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రోత్సహిస్తున్న జాస్తి బుజ్జిని అభినందించారు. పుణ్యాచారిటీస్ కార్యదర్శి జాస్తి విజయ భూషణ్ కుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షులు జివి రవికుమార్, కార్యదర్శి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఉప సర్పంచ్ జాస్తి శ్రీధర్ బాబు, రొటేరియన్ అన్నే హరికష్ణ తదితరులు పాల్గొన్నారు.



వరద ఉధృతిపై అప్రమత్తం

- కృష్ణాజిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : ప్రకాశం బ్యారేజీలో వరద ఉధృతి అధికంగా ఉన్నందున జిల్లాలో కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ వారి చాంబర్ నుండి జిల్లా అధికారులు, క్షేత్రాధికారులతో వరద పరిస్థితులపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించి డివిజన్ల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజ్ ఎగువన భారీ వర్షాల కారణంగా 5 లక్షల క్యూసెక్కులకు మించి వరద ప్రవాహం వస్తుందని, ఆ నీటిని బ్యారేజీ గేట్లు అన్నీ ఎత్తి కష్ణా నదిలోకి వదిలారన్నారు. జిల్లాలోని అధికారులు ముఖ్యంగా జలవనరులు, రెవిన్యూ, పోలీసు,రవాణా, మత్స్యశాఖ, పంచాయతీ రాజ్, రహదారులు భవనాలు, వ్యవసాయ తదితర శాఖల అధికారులు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే లంక గ్రామాలకు నీరు ఎక్కువగాచేరిందని తెలుస్తోందన్నారు. ఎక్కడైనా రహదారులు తెగిపోయి ఉంటే వాటిని వెంటనే పునరుద్ధరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా రహదారులు దెబ్బతిని రాకపోకలకు అంతరాయం కలిగితే, నిధులకు ఎలాంటి కొరత లేదని ముందు పునరుద్ధరణ పనులు తక్షణమే చేపట్టాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో గ్రామ రెవెన్యూ అధికారులు చాలా అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు వరద అంచనా వేస్తూ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు కావలసిన ఆహారము, మంచినీరు, విద్యుత్తు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు..ఈ టెలికాన్ కాన్ఫరెన్స్లో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, గుడివాడ, మచిలీపట్నం, ఉయ్యూరు ఆర్డిఓలు బాలసుబ్రమణ్యం, కె.స్వాతి, హేళ షారోన్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగిఉండాలి

ప్రజాశక్తి - పెదపారుపూడి(గుడివాడ) : సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సుపై అవగాహన కలిగి ఉండాలని గుడివాడ డివిజనల్ కోఆపరేటివ్ అధికారి బి కృష్ణకాంత్ పేర్కొన్నారు. గురువారం పెదపారుపూడి మండలంలోని పెదపారుపూడి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నందు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్లోని అన్ని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు సమాచార హక్కు చట్టం అమలులో చిత్తశుద్ధి ప్రదర్శించాలన్నారు. సమాచారం కోరిన వారికి నిబంధనలకు లోబడి సమాచారాన్ని 30 రోజులలో సమర్పించాలని తెలిపారు. ఆర్టిఐనకు సంబంధించి సంబంధిత సీఈఓలు రికార్డు నిర్వహించాలని, పౌర సమాచార అధికారుల పేర్లను కార్యాలయంలో తప్పనిసరిగా ప్రదర్శించాలని కోరారు. ఆర్టిఐ చట్టం పట్ల అధికారులకు ఉన్న విముఖత విడనాడి ఈ సమాచార హక్కు చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని కష్ణ కాంత్ చెప్పారు. ఈ సమావేశంలో డివిజన్లోని అందరూ అసిస్టెంట్ రిజిస్టార్లు, సంఘ సీఈవోలు పాల్గొన్నారు.



సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : స్కానింగ్ కేంద్రాలలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, దీనిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మచిలీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) కే స్వాతి హెచ్చరించారు.గురువారం కలెక్టరేట్ లోని మచిలీపట్నం ఆర్డీవో ఛాంబర్ లో రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన పిసిపిఎన్డిటి చట్టంపై ఉప జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మచిలీపట్నం డివిజన్ పరిధిలోని అన్ని స్కానింగ్ కేంద్రాలలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపై మాత్రమే కాకుండా అడిగినవారు, ప్రోత్సహించిన వారిపై సైతం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డివిజన్లో గల స్కానింగ్ కేంద్రాలన్నీ తప్పనిసరిగా నమోదు చేసుకొని ప్రతి ఐదు సంవత్సరములకు ఒకసారి రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ప్రతి స్కానింగ్ కేంద్రంలో ధరల పట్టిక, హెచ్చరిక బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. డివిజన్‌లో అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహించి చట్టాన్ని అతిక్రమించిన వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామన్నారు. జనాభాలో స్త్రీ పురుష లింగ నిష్పత్తులలో వ్యత్యాసం లేకుండా ప్రజల్లో క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఈ సమావేశంలో కమిటీ సభ్యులు బందరు డీఎస్పీ చప్పిడి రాజా, జిల్లా రోగనిరోధక అధికారి డాక్టర్ ప్రేమచంద్, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ఎం ధర్మతేజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ స్వాతి

ఎపిఎంపై దాడికి నిరసన

ప్రజాశక్తి-పామర్రు : అన్నమయ్య జిల్లా పెద్దకడబూరులో ఏపీఎం రజనీపై దాడిని ఖండిస్తూ పామర్రు ఐకెపి సిబ్బంది స్థానిక కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగాఏపీఎం. సిహెచ్. తిరుపతిరావు ఉద్యోగ విధులలో ఉన్న వారిపై దాడులు చేయడం అమానుషం అన్నారు.ఈ కార్యక్రమంలో ఏసు, బాలమని, నరేష్, పద్మ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎఫ్‌ఎ-1 పరీక్షలు

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండలంలో ఈనెల 11వ తారీకు నుంచి ప్రారంభమైన సెల్ఫ్ అసెస్మెంట్ ఎఫ్ ఏ-1 పరీక్షలు గురువారం తో ముగిశాయి. మండలంలోని 12 ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలు, 46 ఎంపీ ఎలిమెంటరీ పాఠశాలలు, 9 జిల్లా పరిషత్ హై స్కూల్స్, ఒక ఎయిడెడ్ హై స్కూల్, రెండు యూపీ పాఠశాలలు కలిపి 70 పాఠశాలల్లో ఈ పరీక్షలకు.5,194 మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారు. మండలంలో పలు పరీక్షా కేంద్రాల్లో ఎంఈఓ-2 శ్రీలక్ష్మి తనిఖీలు నిర్వహించారు.

నీట మునిగిన జగనన్న కాలనీ

ప్రజాశక్తి-బంటుమిల్లి : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బంటుమిల్లిలోని జగనన్న కాలనీ పూర్తిగా వర్షం నీటితో మునిగిపోయింది. కాలనీలో మోకాళ్ళ లోతు నీళ్లు రావడంతో స్థానికులు ఇబ్బందులుపడుతున్నారు. ప్రజలు బయటకు వచ్చే అవకాశం లేకుండా ఉండడంతో వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఈ కాలనీకి ఆనుకుని బంటుమిల్లి నుండి పెందూరు వెళ్లే మురుగు కాలువ గట్టు తెగిపోవడంతో చిన్నపాటి వర్షానికి కూడా కాలనీ మునిగిపోతోందని స్థానికులు అంటున్నారు. ఆ గండిని పూడ్చాలని అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదని చూస్తున్నారు. కాలనీలో సమస్యలు పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు, లంకదాసుల అజయ్ గోష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావులు కోరారు.

కలవపాముల సర్వేయర్ సస్పెన్షన్

ప్రజాశక్తి-ఉయ్యూరు : కలవపాముల గ్రామ సచివాలయ గ్రామ సర్వేయర్ వర్రె అరుణకుమార్‌ను విధులనుండి జిల్లా సర్వే అధికారి సస్పెండ్ చేసినట్టు ఎంపీడీవో జివిస్వి శేషగిరిరావు తెలిపారు. ఇటీవల తన భార్య మరణానికి అరుణ్ కుమార్ కారకుడుగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో అతనిని సస్పెండ్ చేస్తూ జిల్లా సర్వే అధికారి ఉత్తర్వులు జారీచేసినట్టు తెలిపారు.



గుడివాడ కోర్టుకు వంశీ హాజరు

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ కోర్టుకు గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ గురువారం హాజరయ్యారు. ఇటీవల ఉంగుటూరు మండలం ఆత్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఓ కేసులో వారం,వారం కోర్టులో సంతకాలు చేయాల్సిన వంశీ గన్నవరం కోర్టు జడ్జి సెలవులో ఉండడంతో గుడివాడ కోర్టుకు హాజరై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వంశీని గుడివాడకు చెందిన వైసిపి కృష్ణా జిల్లా యూత్ అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, నాయకులు పాలేటి చంటి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మొండ్రు వెంకటేశ్వరరావు, అద్దేపల్లి పురుషోత్తం, తదితరులు కలిశారు.



డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని నిరసన

ప్రజాశక్తి-కంకిపాడు : యనమలకుదురు, తాడిగడప డొంక రోడ్డు లోని వినాయక నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో గురువారం నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు మాట్లాడుతూ రోడ్లపై డ్రైనేజీ నీరు నిలవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రన్నారు. డ్రైనేజీ వాటర్‌లో మంచినీటి పైప్ లైన్ కూడా మునిగిపోయి మంచి నీరు కలుషితమై ప్రజలు తీవ్రమైన రోగాలతో, వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. సంవత్సరం నుండి ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ఈ సమస్య పరిష్కారంకాలేదన్నారు. అధికారులు ఇప్పటికైనా ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. మహిళా సంఘం పెనమలూరు మండల కమిటీ అధ్యక్షురాలు షేక్ వలిబి, ప్రజానాట్యమండలి కృష్ణాజిల్లా కార్యదర్శి షేక్ ఖాసిం, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే లైసెన్స్ రద్దు

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఎంఆర్‌పి ధరల కన్నా ఎరువులను ఎక్కువ ధరకు విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జె విమల కుమారి అన్నారు. గురువారం తాసిల్దార్ కార్యాలయంలో మండలంలోని ప్రైవేట్ ఎరువుల దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విమలా కుమారి, మండల వ్యవసాయ శాఖ అధికారి జి రమేష్‌లు మాట్లాడుతూ మండలంలోని ఎరువుల షాప్ డీలర్స్ ఎరువులు ఎం ఆర్ పి ధరకు మించి ఎక్కువ ధరకు విక్రయించినా, కావాలని యూరియా కత్రిమ కొరతను సష్టించినా, వేరే ఎరువులతో ముడి పెట్టి యూరియా అమ్మినట్లు ఏ విధమైన సమాచారం వచ్చినా కఠినమైన చర్యలు తీసుకుంటామని, వారి లైసెన్సును కూడా రద్దు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ ఎరువుల దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

లిటిల్ బ్రెయిన్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు గురువారం పాఠశాల ఆవరణలో జరిగాయి. బాల బాలికలను తల్లిదండ్రులు చిన్నికృష్ణ గోపికలుగా అలంకరించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉట్టి కొట్టి విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంస్థ డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి ఆటలలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుధ ప్రవీణ ముక్తేవి, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అందరికీ కృష్ణాష్టమి వేడుకల విశిష్టతని భారతీయ సంస్కృతి గురించి వివరించారు. 8,9వ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన చిన్ని కృష్ణ నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది కార్యక్రమం లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండ ప్రాంతాల రిటైనింగ్ వాల్‌కు రూ.100 కోట్లు కేటాయించాలి

సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు 49వ డివిజన్ టైలర్ పేట వీరయ్య వీధిలో నివాసం ఉంటున్న కె.శ్రీనివాసరావు రేకులు ఇల్లు రిటర్నింగ్ వాల్ కింద భాగంలో ఉన్న దుర్గారావు రేకుల ఇంటిపై జారిపడింది. ఈ సంఘటన నేపథ్యంలో సిపిఎం బృందం సంఘటనా స్థలాన్ని పరిశీలించింది. రోజువారి కూలి పనులు చేసుకునే పేద కుటుంబాలకు సంబంధించి ప్రభుత్వం జెఎన్ఎన్‌యుఆర్ఎంయు ద్వారా నిర్మించబడి కబేలా ప్రాంతంలో ఖాళీగా ఉన్న ఇళ్లను బాధిత కుటుంబాలకు వెంటనే కేటాయించాలని ఈ సందర్భంగా సత్యబాబు కోరారు. నగరంలో కొండ ప్రాంతాలు చిన్నపాటి వర్షాలకే రిటైనింగ్ వాల్ కూలిన ఘటనలతో పలువురు మరణించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొండ ప్రాంతాల అభివృద్ధి కోసం రిటర్నింగ్ వాల్ నిర్మాణం కోసం రూ.100 కోట్ల గ్రాంట్ విజయవాడ నగరానికి ఇవ్వాలని కోరారు. నగరంలో చిన్నపాటి వర్షాలకకు చెరువులను తలపించేలా రోడ్లున్నాయని మ్యాన్‌హోల్ రూ.259 కోట్లు విజయవాడ నగరానికి వెంటనే కేటాయించి ముంపు నివారణ చర్యలను వేగవంతంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. ముందస్తు కొండ ప్రాంతాల్ని రెవెన్యూ విఎంసి విభాగం సర్వే చేసి ప్రమాదకరంగా ఉన్న నివాసాల నుండి పురావాస సహాయ కేంద్రాలకు తరలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనల్లో సిపిఎం నాయకులు ఎన్.గురప్ప, పి.శ్రీను, రాము పాల్గొన్నారు.

'ఆర్' స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఫ్రెంచ్ కార్ల తయారీ సంస్థ రెనాల్ట్ గ్రూప్ యొక్క పూర్తి యాజమాన్యంలోని అనుబంధ సంస్థ అయిన రెనాల్ట్ ఇండియా, విజయవాడలో తమ కొత్త' ఆర్' స్టోర్‌ను ప్రారంభించింది,. ఈ సందర్భంగా సంస్థ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ ఫ్రాన్సిస్కో మాట్లాడుతూ నిడమానూరులో అత్యాధునిక షో రూమ్ ప్రారంభించినట్లు తెలిపారు.ఇది ఆంధ్రప్రదేశ్లో తమ కొత్త, ఆధునిక వాణిజ్య గుర్తింపుకు నాంది పలికిందన్నారు. మారుతున్న కస్టమర్ అభిరుచులకు అనుగుణంగా, డిజైన్ ఆవిష్కరణ, డిజిటల్ ఇంటిగ్రేషన్, కస్టమర్-ఫస్ట్ సేవలను మిళితం చేయడానికి రెనాల్ట్ ఇండియా బ్రాండ్ అనుభవం, పరివర్తన వ్యూహంలో భాగంగా ఈ ప్రారంభించామన్నారు.

యూకో బ్యాంకు విజయవాడ జోనల్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కోల్‌కత ప్రధాన కేంద్రంగా నడుస్తున్న యూకో బ్యాంకు ఆంధ్రప్రదేశ్‌లో జోనల్ ఆఫీసును తాడేపల్లిలోని మణిపాల్ ఆసుపత్రి ఎదురుగా గురువారం యూకో బ్యాంకు ఎండీ అండ్ సీఈఓ అశ్వినికుమార్ వర్చువల్‌గా పాల్గొని లాంఛనంగా ప్రారంభించారు. డిప్యూటీ జనరల్ మేనేజర్, జోనల్ మేనేజర్ ఎస్.శరవణన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ జోనల్ హెడ్ అండ్ ఏజీఎం ప్రశాంత్‌కుమార్ దారా, జోనల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూకో బ్యాంకు ఎండీ అండ్ సిఇఒ అశ్వినికుమార్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 48 బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ జోనల్ మేనేజర్ ఎస్.శరవణన్, డిప్యూటీ జోనల్ హెడ్ అండ్ ఏజీఎం ప్రశాంత్‌కుమార్ దారా మాట్లాడుతూ విజయవాడ కేంద్రంగా జోనల్ కార్యాలయం స్థాపించి టర్నోవర్ గ్రోత్‌ను మరింత పెంచుతామన్నారు.

పునరావస కేంద్రాలను పరిశీలించిన కొండపల్లి మున్సిపల్ చైర్మన్



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణానది వరద ముప్పు ప్రాంత ప్రజలను తరలించేందుకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, కమిషనర్ రమ్య కీర్తన తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్న లంక, పెద్దలంక, వరద ముంపు ప్రాంత ప్రజలను తరలించేందుకు పూర్తి ఏర్పాటులు చేశామని, పునరావాస కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, పశువులకు మేత అందజేయాలని అధికారులకు కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ,టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సహకార సంఘాల ద్వారా యూరియా అందించాలి



ప్రజాశక్తి - ఎ.కొండూరు : మండలంలోని అన్ని కోఆపరేటివ్ సోసైటీల ద్వారా యూరియా అందించాలని రైతు సంఘం నాయకులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గురువారం రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో మండల వ్యవసాయాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల కార్యదర్శి ఆళ్ల అమ్మిరెడ్డి మాట్లాడుతూ మండలంలో మెట్ట పంట వేసి రెండు నెలలు, వరి పంట వేసి నెల రోజులు కావస్తున్నా రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. ప్రైవేటు వ్యాపారుల దగ్గర యూరియా కొరకు వెళితే క్యాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామంటున్నారని, అది ఎక్కువ ధర చెల్లించి కొనాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. నానో యూరియా, నానో డి ఏ పి వాడండని రైతులకు బలవంతం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మండలంలోని అన్ని సోసైటీల ద్వారా యూరియాను అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో రైతు సంఘం మండల అధ్యక్షులు బొమ్మెన శ్రీను, కౌలు రైతు సంఘం నాయకులు పి.ఆనందరావు, సోమ మోహన్ రావు, పంబి వెంకటేశ్వరావు, మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో ఆరోగ్య శిబిరాలు : కమిషనర్

ప్రజాశక్తి - విజయవాడ : ప్రతి పునరావాస కేంద్రంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమీషనర్ ధ్యానచంద్ర సూచించారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా ప్రకాశం బ్యారేజ్, హెచ్ బి కాలనీ, అజిత్ సింగనగర్ అన్న కాంటీన్, వన్ టౌన్ లో బ్రిడ్జ్ ప్రాంతాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ వన్‌టౌన్‌లో – బ్రిడ్జ్ వద్ద ఉన్న గోడ ప్రమాదకరమైన స్థితిలో ఉందని ఇప్పటికే పలుమార్లు చెప్పినప్పటికీ అధికారులు ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకొని వెంటనే ఆ మరమ్మతులు చేపట్టాలని, ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా వెంటనే చర్యలు తీసుకునేలా ఇరిగేషన్ శాఖ వారితో మాట్లాడాలని వెంటనే మరమ్మతులు చేయించాలని కమీషనర్ అన్నారు. ప్రతి పునరావాస కేంద్రంలో కచ్చితంగా వైద్య శిబిరం, రిసెప్షన్ ఏర్పాటు చేయాలని, పునరావాస కేంద్రాలను ఆశ్రయించే ప్రజల నమోదును రిజిస్టర్ ఖచ్చితంగా పాటించాలని, పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండాలని, లైట్లు, ఫ్యాన్లు, ఎలక్ట్రిసిటీ సంబంధిత వసతుల్లో ఎటువంటి లోపం ఉండరాదని అధికారులను ఆదేశించారు. కొత్త రాజరాజేశ్వరి పేట కేర్ అండ్ షేర్ స్కూల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలకు ఉదయం టిఫిన్ కమిషనర్ ధ్యానచంద్ర అందించారు. ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్న కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జె. శ్రీనివాస్, వి.శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ బాబు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎంపి పరామర్శ

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : మ్యాన్‌హోల్‌లో పడి మృతిచెందిన మెడికల్ వ్యాపారి, 53వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు టి.వి.మధుసూదనరావు కుటుంబాన్ని ఎంపి కేశినేని శివనాథ్ గురువారం పరామర్శించారు. ఇదే డివిజన్ టిడిపి బూత్ కన్వీనర్ షేక్ ముర్తుజావలి, అదే రోజు రాత్రి ప్రమాదవశాత్తు అవుట్ ఫాల్ డ్రైయిన్‌లో పడి మృతి చెందిన సంగతి తెలిసిందే. ముర్తుజా కుటుంబ సభ్యులను ఎంపి కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఎంపీ వెంట స్టేట్ నూర్ భాషా దూదేకుల సంఘం కార్పొరేషన్ చైర్మన్ కె.నాగుల్ మేరా టిడిపి కార్పొరేటర్ ఉమ్మడి చంటి పలువురు టిడిపి నేతలున్నారు.

ఎంపిని కలిసిన మరుపిళ్ల

విజయవాడ సిటీ : విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్‌ను, గురువారం నగరాల సంక్షేమ సంఘం అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మరుపిల్ల తిరుమలేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగాకేశినేని చిన్ని మరుపిల్ల తిరుమలేష్ కు పుష్ప గుచ్చం అందజేసి దుశ్యాలువాతో సత్కరించారు. అనంతరం నగరాల కుల పెద్దలు, యువత తిరుమలేష్ కు అభినందనలు తెలియజేశారు.

సింగిల్ విండో పద్ధతిలో చవితి పందిర్లకు అనుమతి

ప్రభుత్వానికి జిల్లా గణేష్ ఉత్సవ సమితి వినతి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఈనెల 27 నుండి జరగబోయే గణపతి నవరాత్రులకు ఏర్పాటుచేసే చవితి పందిళ్లకు సింగిల్ విండో పద్ధతిలో అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్టీఆర్ జిల్లా గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు పిన్నం రాజు త్రిమూర్తి రాజు, కార్యదర్శి సాన శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. గురువారం వన్‌టౌన్ కెనాల్ రోడ్‌లోని వినాయకుడి గుడి వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం తరపున వివిధ విభాగాల సహకారంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవాలు చక్కగా పూర్తయ్యేలా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.. వినాయక చవితి పందిర్ల కోసం జిల్లాలో విజయవాడతో సహా పలు ప్రాంతాల్లో అప్లికేషన్ తీసుకునే వ్యవస్థను ఎన్టీఆర్ జిల్లా గణేష్ ఉత్సవ సమితి ఏర్పాటు చేస్తుందన్నారు. శ్రీ గణేష్ ఉత్సవ మండపాలు ఏర్పాటు చేసే వారు తమ సమితి వద్ద అప్లికేషన్ రాసిస్తే సింగిల్ విండో పద్ధతిలో అనుమతులు తీసుకొచ్చేలా తమ ఉత్సవ సమితి పనిచేస్తుందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు కోనేరు దుర్గాప్రసాద్, జిల్లా సమితి ఉపాధ్యక్షులు బాలకిషన్ లోయ, ప్రచార సహా కార్యదర్శి ముదిగొండ శివ, కొంపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో పంటలకు శాస్త్రవేత్త ల సూచనలు

ప్రజాశక్తి జగ్గయ్యపేట: గత మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా పలు పంటలకు అధిక తేమ వలన మరియు ముంపు వలన నష్టం కలిగే అవకాశం ఉందని దీనికి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా ఎస్ కృష్ణంరాజు మరియు కషి విజ్ఞాన్ కేంద్ర, శాస్త్రవేత్తలు తెలిపారు. రైతులు అధికంగా ఉన్న పల్లపు ప్రాంతాలలో సాధ్యమైనంత వరకు నీటిని కాలువల ద్వారా బయటికి పంపే ప్రయత్నం చేయాలి.



ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న నెట్టెం రఘురాం

ప్రజా ఉద్యమాలకు అండ ప్రజాశక్తి : నెట్టెం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ప్రజా ఉద్యమాలకు ప్రజాశక్తి అండగా ఉంటోందని కెడిసిసి బ్యాంకు చైర్మన్, మాజీ మంత్రి నెట్టెం రఘురాం అన్నారు. ప్రజాశక్తి 45వ వార్షికోత్సవం సందర్భంగా ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ ప్రజాశక్తి 45 సంవత్సరాలుగా ప్రజా పక్షాన నిలుస్తోందన్నారు. ప్రజా సమస్యలను వెలికి తీసి ఆ సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తోందన్నారు. ప్రజా ఉద్యమాలకు ఊతంగా నిలుస్తోందని చెప్పారు. ఈకార్యక్రమంలో ప్రజాశక్తి నందిగామ డివిజన్ ఇన్చార్జి ఎం.శ్రీనివాసరావు, జగ్గయ్యపేట, వత్సవాయి ప్రజాశక్తి విలేకరులు జుజ్జువరపు వెంకట రావు, కరిసే రత్నబాబు పాల్గొన్నారు.

నగరంలో స్కోడా ఆటో 25వ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : దేశ వ్యాప్తంగా 25వ వార్షికోత్సవం, విశ్వవ్యాప్తంగా 130 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా స్కోడా ఆటో వారి ఉత్తమ-విక్రయ మోడల్‌లైన కుశఖ్, స్లావియా, కైలాఖ్ కార్లను నగర మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి.శ్రీనివాసన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎక్స్‌క్లూజివ్, పరిమిత-స్థాయి ఎడిషన్‌లలో విలక్షణ రూపకల్పన మెరుగుదలలు, ప్రీమియం ఫీచర్‌లు ఉన్నాయని తెలిపారు. వీటితో పాటు 25వ వార్షికోత్సవాన్ని ప్రతిబింబించే బ్యాడ్జింగ్ నగర మార్కెట్లో బ్రాండ్‌కు సంబంధించి నిరంతర అంకితభావం కూడా ఉన్నాయి.అని తెలిపారు .ఈ పరిమిత ఎడిషన్‌లు ఇప్పటికే ఉన్న హై-స్పెసిఫికేషన్‌ల ఆధారంగా తయారు చేయబడ్డాయని తెలిపారు. వివరాలకు నగరంలోని స్కోడా స్టార్‌లో సంప్రదించ వచ్చని తెలిపారు.

విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి పోవద్దు

ప్రజాశక్తి - వత్సవాయి : మండల కేంద్రమైన పెనుగంచిప్రోలు కెవిఆర్ జిల్లా పరిషత్తు బాలుర పాఠశాలలో నశాముక్త భారత్ అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. హెచ్ఎంకే జలజ మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మత్తు పదార్థాల నిరోధకతను పాటించాలని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు

చెత్త తొలగింపు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో వరదలు కారణంగా మురుగు నీరు రోడ్లపైకి రావడంతో పంచాయతీ కార్యదర్శి రామారావు వెంటనే డ్రైనేజీ పనులు ప్రారంభించారు. నీటి పారుదలకు అడ్డుగా నిలిచిన చెత్త, మురుగును తొలింగించడంతో సమస్య పరిష్కారం అయింది. రాఘవాపురం వడ్డెర కాలనీ సమీపంలో వంతెన వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించారు. గ్రామంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

వరద ఉధృతితో పంటలు మునక

- తోట్లవల్లూరు మండలంలో కంద, పసుపు పంటలు మునక
- గన్నవరంలో 142.8 మిమీ వర్షపాతం నమోదు
- పాతఎడ్లలంకకు తెగిన సంబంధాలు
- వరద ఉధృతిపై అధికారులు అప్రమత్తం



తోట్లవల్లూరు మండలంలోని లంక గ్రామాల్లో నీట మునిగిన కందపంట



పులిగడ్డ అక్విడెక్ట్ వద్ద వరద ఉధృతి



తోట్లవల్లూరు మండలంలో పడవలపై ప్రయాణం



ఉయ్యూరు మండలంలో నీట మునిగిన పొలాలు



కోడూరు మండలంలో కోతకు గురైన ఉల్లిపాలెం-హంసలదీవి కరకట్ట

అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కృష్ణానదికి వరద ఉధృతి పెరిగింది. నదీపరివాహక గ్రామాలు, లంక గ్రామాలు నీటమునిగాయి. తోట్లవ ల్లూరు మండలంలోని లంక గ్రామాల్లో కంద, పసుపు పంటలు నీటమునిగాయి. అవనిగడ్డ మండలంలో పాత ఎడ్లలంకకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో అధికారులు అప్రమత్తమై ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గన్నవరం మండలంలో 142.8 మిమి వర్షపాతం నమోదైంది.

ప్రజాశక్తి-గన్నవరం : అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. కుండ పోత వానతో చెరువుల్లోకి నీరు వచ్చింది. బుడమేరు పొంగుతోంది. మండ లంలో అత్యధికంగా వరకు 142.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కేసరపల్లి దగ్గర బుడమేరు కాలువపై వున్న రహదారిపైకి వరద నీరు భారీగా చేరుకోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. విజయవాడ ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా బుడమేరు పొంగటంతో జక్కుల నెక్కలం ప్రజలను అప్రమత్తం చేశారు. వర్షం కారణంగా రాత్రి సమయంలో పలుచోట్ల చెట్లు కూలడం, ఆ సమయంలో వాన కురుస్తుండటంతో అటుగా బైకుపై వెళ తున్న వారు ఇబ్బంది పడ్డారు. నియోజకవర్గంలోని పలు వాగులు పొంగాయి. దీంతో బుడమేరుకు స్వల్పంగా వరద వస్తోంది. ఇంకా వర్షం పడితే బుడమేరుకు వరద వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గూడవల్లి వద్ద బుడమేరు ప్రమాదకరంగా వరద ప్రవహిస్తోంది. ప్రస్తుతం నీటి మట్టం 8 అడుగుల దగ్గర ఉంది. వరద ఉధృతి మరింత పెరిగితే మాత్రం చుట్టూ ఉన్న వరి చేలు వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. ఈ ప్రభావం కేసరపల్లి పై ఎక్కువగా ఉంటుంది. **ప్రజాశక్తి-చల్లపల్లి** : నారాయణరావు నగర్ లోని లోతట్టు ప్రాంతం, వైసిపి కాలనీలలో నీరు చేరడంతో రహదారులన్నీ బురద మయంగా మారాయి. **ప్రజాశక్తి-కంకిపాడు** : కృష్ణానది వరద ఉధృతిపై కంకిపాడు మండలంలోని మద్దూరులో మండల ప్రత్యేక అధికారి ఎంపీడీవో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. అలాగే నది లోపలికి ఎవరు వెళ్లకుండా గ్రామపంచాయతీ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాల న్నారు. కాసరనేనివారి పాలెం సర్పంచు పి వరప్రసాద్, మద్దూరు పంచాయతీ ఈవో కిరణ్ కుమార్, వీఆర్వో, పాల్గొన్నారు.

ఉల్లిపాలెం-హంసలదీవిల మధ్య కోతకు గురైన కరకట్ట.

ప్రజాశక్తి-కోడూరు : కృష్ణానది కరకట్ట కోడూరు మండలం ఉల్లిపాలెం హంసలదీవి గ్రామాల మధ్య పలు చోట్ల కోతకి గురవుతోంది. ప్రస్తుతం కష్ణా నదికి ఆరు లక్షల క్యూసెక్కుల వరకు వరద వస్తున్న విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద 5 నుంచి 6 లక్షల క్యూసెక్కుల వరకు దిగువకు విడుదల చేసున్న నేపథ్యంలో ప్రమాదం పొంచి ఉందని నది పరివాహక ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ నేపద్యంలో కరకట్టకు ముప్పు పొంచి ఉన్నందున, ఇరిగేషన్ అధికారులు ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కోడూరు పిట్టలంక ఉల్లిపాలెం అవుట్ పాల్స్ వద్ద వరద నీరు ఎగువకు రాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరు చున్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు** : తోట్లవల్లూరు మండలంలో కృష్ణానది పాయ ఉధృతంగా ప్రవహిస్తుంది. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం తీవ్రంగా ఉండడంతో కరకట్ట అంచు వరకు చేరింది. కంద, పసుపు,చెరకు, అరటి, కూరగాయ పంటలు సైతం వరద నీటిలో మునిగి తేలి ఆడుతున్నాయి. వాణిజ్య పంటలను సాగు చేసిన రైతులు వరద దాటికి అల్లాడుతున్నారు.లంక గ్రామాల ప్రజలు నాటు పడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. విద్యుత్ అధికారులు లంక గ్రామాల ప్రజలకు విద్యుత్ అందించేందుకు పెద్ద టవర్ల నుంచి లైన్లు కలిపి విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నారు. 6 లక్షల క్యూ సెక్కుల వరకు నీటి ప్రవాహం నడుస్తుందని ఎగువ నుంచి ఇంకా వచ్చే అవకాశం ఉందని లంక గ్రామాల ప్రజ లంతా అప్రమత్తంగా ఉండాలని, అధికారులంతా పర్య వేక్షిస్తూ ఉండాలని తాసిల్దార్ కుసుమ కుమారి కోరారు.

అవనిగడ్డలో వరద ఉధృతి

ప్రజాశక్తి-అవనిగడ్డ : కృష్ణా నదికి మరోసారి వరద పోటీ ఎత్తడంతో నదీ గర్భంలోని గ్రామాల ప్రజలు భయాం దోళనలకు గురవుతున్నారు. ఇప్పటికే పాత ఎడ్ల లంక గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టడంతో ఆ గ్రామానికి బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. దీనితో సీఐ యువకుమార్, ఎస్సై శ్రీనివాసరావు, తాసిల్దార్ కే నాగమల్లేశ్వరరావు, ఇన్చార్జ్ ఎంపీడీవో ఎం వనజ ఇతర అధికారులు ఆ గ్రామానికి చేరుకొని గ్రామ ప్రజలకు పలు సూచనలు చేశారు. నదిలో ఉధతి మరింత పెరిగే అవకాశం ఉందని గ్రామస్తులు పునరావాస కేంద్రానికి తరలివచ్చేందుకు సిద్ధం కావాలని సూచిం చారు. కాగా పులిగడ్డ ఆక్విడేట్టు వద్ద కృష్ణానది 17 అడుగుల మేర నీరు ప్రవహిస్తూ ఆక్విడెక్ట్ కు సమానంగా వరద నీరు ప్రవహిస్తుంది.

అలాగే కృష్ణా నదికి వరద ఉధతి పెరగడంతో నది సమీపంలో ఉన్న పులిగడ్డ పంచాయతీ శివారు పల్లెపాలెం రేగులంక ప్రజలను గ్రామ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ ఈవో బి అనిత అధికారులతో కలిసి అప్రమత్తం చేశారు. గురువారం హార్టికల్చర్ అధికారి రమేష్ గ్రామ ఉపసర్పంచ్ మండల వెంకటేశ్వ రరావుతో కలిసి వరద ప్రాంతంలో పర్యటించారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు** : రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలో 142 హెక్టార్లలో వరిపైరు నీటమునిగినట్టు మండల వ్యవసాయ అధికారి బి. నిస్సీగ్రేస్ తెలిపారు. ముదునూరు, కాటూరు, వీరవల్లి, కడవకొల్లు గ్రామాల పొలాల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. కంకిపాడు, పెనమలూరు మండల పరిధి గ్రామాలనుంచి, వచ్చిన వర్ష ప్న నీరు పోయే చంద్రయ్య కోడు మురుగు కాల్వ పూడిక తీతకు నోచుకోపోవడం వల్ల పొట్లపాడు, కడవకొల్లు, గండిగుంట, వీరవల్లి గ్రామాలలో పొలాలు ముంపుకు గురవు తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంట్రప్రగడ మురుగు కాల్వ పూడికతో ముదునూరు పరిసర గ్రామాల పొలాలు ముంపుకు గురై నష్టపోవలసి వస్తుందని రైతులు వాపోతున్నారు.

పెరుగుతున్న వరద

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి : క్ృ ష్ణా నదిలో వరద ఉధ్రుతి పెరగడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. గురువారం మధ్యాహ్నాం మూడు గంటల సమయానికి ప్రకాశం బ్యారేజీ దిగువకు 5 లక్షల 65, 807 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. దిగువ పరివాహక ప్రాంతాల్లో లంక భూములను ఆనుకుని వరద నీరు ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా జిల్లా ఇన్ఛార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారు లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ, జలవనరులు, రెవెన్యూ, పోలీసు, రవాణా, మత్స్యశాఖ, పంచాయతీరాజ్, రహదారులు, భవనాలశాఖ అధికారులు ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని అంచనా వేసుకుని తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని, దీనిలో భాగంగా అవసరమైన ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఆరువేల హెక్టార్లలో వివిధ పంటలు సాగవుతున్నాయి. పసుపు, కంద, అరటి, తమలపాకు తదితర ఉద్యాన పంటలు అత్యధికంగా సాగవు తున్నాయి. వరద ఉధ్రుతి మరింతగా పెరిగితే పంటలు ముంపుకు గురవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



తోట్లవల్లూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది

కృష్ణాలో సగటున 31. 8 మిల్లీ మీటర్ల వర్షపాతం
అత్యధికంగా ఉంగుటూరులో 116.2 మిల్లీ మీటర్లు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కృష్ణాజిల్లా వ్యాప్తంగా బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు సగటున 31. 8మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఉంగుటూరు మండలంలో 116.2, అత్యల్పంగా కోడూరులో 8.2 మిల్లీ మీటర్లు నమోదైంది. గన్నవరంలో 103.0, నందివాడ 64.8, బాపులపాడు 51.2, కంకిపాడు 44.0, పెనమలూరు 42.6, ఉయ్యూరు 32.8, గుడివాడ 32.6, తోట్లవల్లూరు 32.4, గుడ్లవల్లేరు 30.2, కృత్తివెన్ను 26.0, బంటుమిల్లి 24.0, పెడన 22.2, మచిలీపట్నం నార్త్, సౌత్ 21.6, పెదపారుపూడి 20.6 పామర్రు 20.4, పమిడిముక్కల 20.4, మొవ్వ 20.2, గూడూరు 15.4, ఘంటసాల 13.8, చల్లపల్లి 13.2, నాగాయలంక 10.2, అవనిగడ్డ 8.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

నీటిలోనే వరి పైరు...
ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలంలో 1765 ఎకరాల్లో వరి పంట వరి పంట నీటి ముప్పుకు గురైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా తయారు చేశారు. పాగోలు, మేక వారి పాలెం, మంగళాపురం, పాత మాజేరు, చింతలమడ, వక్కలగడ్డ,చల్లపల్లి గ్రామా లలో పూర్తిగా వరి పంట నీటి ముంపుకు గురైంది. మేక వారి పాలెం,రాముడు పాలెంలో పలుచోట్ల వరి చేలు చెరువులను తలపించేలా మారాయి. పొలాలు నీట మునగడంలో ఎకరానికి సుమారు 15 వేల రూపాయలు పెట్టుబడి పెట్టామని రైతులు వాపోతున్నారు.

జల దిగ్బంధనం

నిలిచిన రాకపోకలు - నీట మునిగిన పంటలు
పునరావాస కేంద్రాల ఏర్పాటు
ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



బుడమేరు వరద పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్ డా లక్ష్మీ శ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి శాంతి నగర్ వద్ద బుడమేరు వరద పరిస్థితిని గురువారం ఉదయం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మిశ పరిశీలన చేశారు. బుడమేరు గండ్లు పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో గండి పడి విజయవాడ మునిగిన నేపథ్యంలో ఆయన పరిశీలన చేశారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వెలగలేరు రెగ్యులేటర్ వద్ద వచ్చే వరద నీటిని బట్టి ఇతర బ్రాంచ్ కాల్వలకు నీరు మళ్ళీంచాలని, దిగువకు సామర్థ్యం మించి విడుదల చేయొద్దని సూచించారు. బుడమేరు వల్ల ఎటువంటి ప్రమాదం రాదని విజయవాడ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేదని, సోషల్ మీడియాలో వచ్చే అనవసర సమాచారం నమ్మొద్దని ప్రజలకు సూచించారు. అనంతరం ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. వరద ప్రభావాన్ని బట్టి అప్రమత్తంగా ఉంటూ ముందస్తు జాగ్రత్తలు చర్యలు చేపట్టాలని స్థానిక అధికారులను ఆదేశించారు.

పునరావాస కేంద్రాల ఏర్పాటు

కృష్ణా నదికి వరద పెరుగుతున్న నేపథ్యంలో పశ్చిమ ఇబ్రహీంపట్నం ట్రక్ టర్మినల్ వద్ద పునరావాస కేంద్రాలు అధికారులు ఏర్పాటు చేశారు. నదీ తీర ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పునరావాస కేంద్ర ఏర్పాట్లను బుధవారం రాత్రి మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు. కృష్ణానదికి వరద నేపథ్యంలో నది తీర ప్రాంత ప్రజలను సుమారుగా 1500 పైగా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. కేంద్రాల్లో ఇలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి సౌకర్యాలతో ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్టు కమిషనర్ తెలిపారు. ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ వద్ద ఏర్పాటు చేసిన సహాయక శిబిరాల్లో ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్‌ను, జూపూడి గ్రామంలో చిన్న లంక రోడ్డు వద్ద వరద ఉధృతిని డిఎంహెచ్ఒ సుహాసిని పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదు సహాయక శిబిరాలను సందర్శించారు.

బుడమేరు ముంపు నివారణకు చర్యలు చేపట్టాలి: సిపిఎం బృందం

విజయవాడ : సెంట్రల్ సిటీ సి.పి.ఎం బృందం కండ్రిక, డాక్టర్స్ కాలనీ, ఉడా కాలనీ, రాజీవ్ నగర్ ప్రాంతాలలో గురువారం పర్యటించి భారీ వర్షాల కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు కె.దుర్గారావు మాట్లాడారు. రాజీవ్ నగర్ హుడా కాలనీ ప్రాంతాలలో ఖాళీ స్థలాలలో నీళ్ళ నిలబడిపోయి చెరువులు మాదిరిగా తయారయ్యాయన్నారు. ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులు మోటార్ల సంఖ్య పెంచాలని ఎప్పటికప్పుడు అధికారులు ఈ ప్రాంతాలలో పర్యటించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు సిహెచ్.శ్రీనివాస్ ఎస్.కె పీరు సాహెబ్ పి. వెంకటరెడ్డి తదితరులున్నారు.

పసుపు, కుంకుమ సమర్పణ ..

విజయవాడ సిటీ : కృష్ణానదికి వరద ఉధృతి పెరిగిన క్రమంలో లోక క్షేమం కోరుతూ శ్రీ కనకదుర్గమ్మ వారి తరపున కృష్ణానదికి ప్రత్యేక పూజలు సుమంగళ ద్రవ్యాలు సమర్పించారు. గురువారం వరద ఉధృతి శాంతించాలని దేవస్థానం ఈవో వి.కె.శీనానాయక్ దంపతులు నదీమతల్లికి దుర్గా ఘాట్ వద్ద కనక దుర్గమ్మ దేవస్థానం తరుపున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో పసుపు కుంకుమలు, గాజులు, వస్త్రాలు దుర్గమ్మ నుండి కృష్ణమ్మకు సమర్పించారు.

వాగులను పరిశీలించిన తహశీల్దార్

విస్సన్నపేట : మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు పొంగిపొర్లుతున్న వాగుల వద్ద పరిస్థితులను తహశీల్దార్ కె.లక్ష్మీ కళ్యాణి, ఇన్చార్జ్ ఎంపిడిఒ ప్రసాద్ పరిశీలించారు.

పోలంపల్లి చెక్ డాం వద్ద ప్రవహిస్తున్న వరద

వత్సవాయి : లింగగూడెం వద్ద వర్షపు నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలు నీటి మునిగాయి. రోడ్లు పొలాలు కనిపించకుండా పోయాయి. సమీపంలోని అనిగండ్లపాడు వద్ద కూచి వాగు మల్లెపాడు వద్ద వాగు పొంగటంతో రాకపోకలు నిలిచిపోయాయి పెనుగంచిప్రోలు మొల్లపాడు రహదారి జలమయమయ్యాయి పోయాయి. శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయం వద్ద మునేర్లోకి ఎవరు వెళ్లకుండా అధికారులు గేట్లు మూయించారు. పంట పొలాల్లో నీళ్లు నిలిచిపోయాయి. కొన్ని చోట్ల వేసినా అట్లు లేచిపోయాయి. నారు కట్టలు సైతం కొట్టుకుపోయాయ. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి .

అధిక వర్షాలపై అప్రమత్తంగా ఉండండి : ఎంఎల్ఎ తాతయ్య

జగ్గయ్యపేట : జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) విజ్ఞప్తి చేశారు. ఇటీవల కురుస్తున్న అధిక వర్షాల కారణంగా తక్కువ ప్రదేశాలు, కాల్వల సమీప ప్రాంతాలు, చెరువులు, వాగుల దగ్గర నివసిస్తున్న ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజల భద్రత కోసం ప్రభుత్వం, మున్సిపల్, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఎటువంటి అత్యవసర పరిస్థితులు ఏర్పడినా తనకు గానీ, స్థానిక అధికారులకు లేదా సహాయ కేంద్రాలకు, మా ఆఫీస్ స్టాఫ్ (పిఎ)లు సిమ్మసర్తి వెంకటేశ్వరరావు(9666646498, షేక్ నాగులుమీరా (9848091441), అన్నెపాక రమేష్ (9705753228), గన్ మెన్లు శ్రీను (8247404437), రఘు (8309725235)లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పిల్లలు, వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

ముంపు ప్రాంతాల్లో ఎంఎల్ఎ తాతయ్య పర్యటన

జగ్గయ్యపేట పట్టణంలోని ఆర్టీసీ కాలనీ, డాంగే నగర్, యానాది కాలనీ ప్రాంతాల్లో వరదనీరు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నట్లు స్థానికులు సమాచారం ఇవ్వగానే, వెంటనే స్పందించిన జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య బుధవారం రాత్రి అక్కడికి చేరుకున్నారు. బైపాస్ రోడ్డులోని చెరువు వద్ద


నందిగామలో మునిగిన పంట

గండి కొట్టే పనులను స్వయంగా పర్యవేక్షిస్తూ, పనులు వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. షేర్ మహమ్మద్ పేట నుండి జగ్గయ్యపేట వెళ్లే రోడ్ లో పెద్దమోరి వద్ద బుధవారం రాత్రి నుండి గురువారం మధ్యాహ్నం వరకు వర్షపు నీరు చెరువు అలుగు పారటంతో వరద నీరు రోడ్డుపై పారడంతో ఎటువంటి వాహనాలు వెళ్ళలేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. జగ్గయ్యపేట నుండి బలుసుపాడు వెళ్లే రోడ్ లో గల మిట్టగూడెం వద్ద వాగు పొంగిపొర్లడంతో రోడ్డుపై వరదనీరు వెళ్లడంతో ఎటువంటి వాహనాలు వెళ్ళకపోవటం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

ఒకపక్క వర్షాలు రావటంతో చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పాలేరు, చెరువులలో నుండి ఎర్ర నీరు (వర్షం నీరు) తగలడంతో చెరువులు, ఏరులో చేపలు ఒక్కసారిగా రోడ్లు, పొలాల్లోకి వచ్చాయి. దీంతో సందిట్లో స్టడేమియాగా ఒక్కసారిగా షేర్ మహమద్ పేట, జగ్గయ్యపేట పట్టణ సమీపంలోని విలియంపేట పరిసర ప్రాంతాల్లో ప్రజలు పొలాల్లోని కర్రలు, గాలాలు, వలలతో చేపలు పట్టారు. దీంతో సందర్శకుల తాకిడి ఎక్కువైంది.

సిపిఎం బృందం పర్యటన : 4 రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల మండలంలోని వరి నాట్లు వేసిన రైతుల పంట పొలాల్లో వరి నాట్లు కొట్టుకొని పోవటం వల్ల రైతులు నష్టపోయారని, మండలంలోని వరదల వల్ల కొట్టుకుపోయిన రోడ్లు లోతట్టుగా ఉన్న కల్వర్టులు, బ్రిడ్జిలను ఎత్తు పైకి లేపి నిర్మించాలని జగ్గయ్యపేట మండల, పట్టణ సిపిఎం కార్యదర్శి సోమోజు నాగమణి అన్నారు. మండలంలోని షేర్ మహమ్మద్ పేట, అనుమంచిపల్లి, బలుసుపాడు, పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంటలను, వరదల్లో చిక్కుకొని ఉన్న ఇళ్లను సిపిఎం బృందం గురువారం పరిశీలించింది.


విస్సన్నపేటలో అధికారుల పరిశీలన

చిలుకూరు వద్ద పొంగి పొర్లుతున్న ఏనుగు గడ్డ వాగు

ఇబ్రహీంపట్నం : చిలుకూరు వద్ద ఏనుగు గడ్డ వాగు పొంగి పొర్లుతుండటంతో చిలుకూరు, దాములూరు, కొత్తపేట, ఆతుకూరు 4 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి గ్రామాలకు ఎటువంటి వాహనాలు వెళ్ళకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. అధికారులు గ్రామస్తులను అప్రమత్తం చేశారు.

చెరువులను పరిశీలించిన ఆర్డీఓ

రెడ్డిగూడెం : మండలంలోని కురిసిన అధిక వర్షాలకు తిరువూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కె.మాధురి, తహశీల్దార్ సుశీలదేవితో కలిసి కోతులవాగు, రెడ్డిగూడెం, పెద్దచేరువు రంగాపురం, పెద్దచెరువు అలుగువాగు మద్దులపర్వ, కట్టలేరు వాగు నరుకుళ్లపాడు వాగులు చెరువులను గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య, గ్రామ రెవెన్యూ అధికారులు, రాజేష్, రమేష్ నాయక్, లావణ్య, ఇమ్మనియేలు, నాగజ్యోతి, విఆర్ఎలు రమేష్, శ్వేత, రాంబాబు, నాగరాజు పాల్గొన్నారు.

తిరువూరు : చౌట పల్లి –జి.కొత్తూరు గ్రామాల మధ్య ఉన్న వెదుళ్ళ వాగు, మధిర రోడ్డులో చింతలపాడు వద్ద గుర్రపు వాగు, అక్కపాలెం రోడ్డులో పడమటి వాగులు పొంగి రోడ్డుపై ప్రవహించటంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీనితో ఆయా వాగుల వద్ద ప్రజల రాకపోకలను నిలుపుదల చేసేందుకు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, ఆర్డీఓ మాధురి, ఎస్ఐ సత్యనారాయణ పర్యవేక్షిస్తున్నారు.

నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఆర్‌డిఒ బాలకృష్ణ

జగ్గయ్యపేట : ఆర్‌డిఒ బాలకృష్ణ, జగ్గయ్యపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.నితిన్ మండల వ్యాప్తంగా అన్నిగ్రామాలు, నదీ పరివాహక ప్రాంతాలైన ముక్తేశ్వరపురం, రావిరాల, వేదాద్రి, పాలేరు పరివాహక ప్రాంతములైన అన్నవరం, బూదవాడ, రెడ్డి నాయక్ తండా, కె.అగ్రహారం, షేర్ మొహమ్మద్ పేట, మల్కాపురం, పర్యటించారు. ఈ కార్యక్రమంలో నందిగామ రెవెన్యు డివిజినల్ అధికారి బాలకృష్ణా, జగ్గయ్యపేట తహశీల్దార్ మనోహర్, డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం కె,పద్మావతి, ఏ,ఈ పంచాయతీ రాజ్ కె.శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పలు గ్రామాల గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల : బ కంచికచర్ల బస్టాండ్ ఆవరణలో 2 అడుగుల మేర నీరు నిలిచి చెరువును తలపించింది. ఏనుగు గడ్డ వాగు, తోళ్ళ వాగు, శుద్ద వాగు, లక్ష్మయ్య వాగు పొంగాయి . వాగులు పొందటంతో చెవిటికల్లు వైపు, పరిటాల నుండి గని ఆత్కురు వైపు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రెవిన్యూ పోలీసు సిబ్బంది వాగుల వైపు ఎవరూ వెళ్ళకుండా పహారా కాశారు. కృష్ణా నదీ, మునేరులకు భారీ గా వరద చేరింది. మున్నేరు వరద 20 వేల క్యూసెక్కుల ప్రవహించింది. మున్నేరు వరద కృష్ణానదిలో కలిసింది. వరద ఉధతి కి తీర ప్రాంతమైన గని ఆత్కూరు, కొత్తపేట, చెవిటికల్లు, వేములపల్లి గ్లామాల పరిధిలో పంట పొలాలు నీటమునిగాయి. అలాగే భారీ వర్షాలకు మండల పరిధిలోని పెసర మినుము పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు.

నీట మునిగిన పంట పొలాలు

నందిగామ : నందిగామ మండలం కంచల గ్రామం ముంపునకు గురైంది. కంచల గ్రామం వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద మంకు నందిగామ మండలం మాగల్లు కొండూరు రామిరెడ్డిపల్లి జొన్నలగడ్డ రాఘవపురం కమ్మవారిపాలెం గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ఎగువ నుండి వస్తున్న వర్షాలు వరదలు వల్ల నందిగామ మండలం దాములూరు వద్ద వైరా కట్టలేరు మునేరు ఉపనదులు ఉధతంగా ప్రవహిస్తున్నంతో కూడలి వంతెన వద్ద వరద ప్రవాహం ఉదతంగా ఉంది దీంతో కూడలి వద్ద గత రెండు రోజుల నుంచి రాకపోకలు నిలిపివేశారు. రాఘవాపురం పల్లగిరి గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. మాగాని, పత్తి, మిర్చి పంటలు పూర్తిగా నీటమునిగాయి. ఎకరానికి పది వేల నుండి 40 వేల వరకు నష్టం వాటి జరిగినట్లు రైతులు వాపోతున్నారు. చందాపురం గ్రామం వద్ద నల్లవాగు ఉదతంగా ప్రవహించడం తో నందిగామ– చందర్లపాడు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రాకపోకలు నిలిచిపోవడం తో వాహనాలు రెండు వైపుల బారులు తీరాయి. పోలీసులు నల్ల వాగు వద్ద ఎవరిని వెళ్ల నీయ కుండా పహారా కాస్తున్నారు.శనగపాడు – అనాసాగరం గ్రామాల మధ్య సెనగపాడు వాగు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి.


కంచికచర్లలో పోలీసుల పహారా


రెడ్డిగూడెంలో అధికారుల పరిశీలన


చౌటుపల్లి - జి.కొత్తూరు గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు



డస్ట్‌బిన్స్ అందజేత

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం ఆర్టీసీ బస్టాండ్ లో పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛభారత్ కు సహకారంగా ఏడు ప్లాస్టిక్ డస్ట బిన్‌లను డిపో మేనేజర్ శివాజీ కి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గన్నవరం శాఖ తరపున అందజేశారు. అలాగే ఆర్టీసీ సిబ్బంది పదిమంది మానవతా సభ్యులుగా చేరారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మడుపల్లి బాలకష్ణమూర్తి , కన్వీనర్ కర్రా వరప్రసాద్, ఉపాధ్యక్షులు పువ్వల ఆదినారాయణ, కార్యదర్శి వివి కష్ణ మోహన్ , కోశాధికారి పొట్లూరి రామకష్ణారావు, డైరెక్ట ర్లు మోటమర్రి శేఖర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి- కలక్టరేట్ (కష్ణా) : స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మచిలీపట్నం ఏఆర్ పోలీస్ పెరేడ్ మైదానం లో జరిగే వేడుకల ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు స్వయంగా పరిశీలించారు. తొలుత ఎస్పీ సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ దేశభక్తిని, జాతీయతా భావాన్ని వ్యక్తపరిచేలా కవాతు నిర్వహించాలని తెలిపారు. అలాగే జెండా వందనానికి విచ్చేసే ముఖ్య అతిథులకు, అతిధులకు ప్రజలకు, విద్యార్థులకు ఎవరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పెరేడ్ కమాండర్ గా బందరు డిఎస్పి సిహెచ్ రాజా వ్యవహరించారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి - గుడివాడ : వివిధ పార్టీలకు చెందిన నాయకులను జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్ కండువాలు కప్పి జనసేనలోకి ఆహ్వానించారు. గురువారం స్థానిక సత్యనారాయ ణపురం జనసేన కార్యాలయంలో 21వ వార్డు మందపాడులోని వివిధ పార్టీలకు చెందిన 40 మంది కార్యకర్తలు కోలవెన్ను కొండలరావు, సాయినాథ్ కష్ణార్జునరావు, కాంద్రు రవీంద్రలు జనసేన పార్టీలో చేరారు. వారికి బూరగడ్డ శ్రీకాంత్ జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్, కార్యదర్శి సాయిన రాజేష్, ఉపాధ్యక్షుడు వేమూరు త్రినాథ్ పాల్గొన్నారు.

అజ్ఞాత స్వాతంత్ర్యధీరుడు...

- స్వాతంత్ర్య పోరాటంలో మంగపతిరావు కీలకపాత్ర

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్వాతంత్ర్యం సాధించి భారతీయులు స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేందుకు ఎందరో మహనీయుల త్యాగఫలం ఉంది.. స్వాతంత్ర్య సమరయోధుల్లో గుడ్లవల్లేరు మండలంలో కౌతవరంకు చెందిన తాళ్లూరి మంగపతిరావు ఒకరు. అజ్ఞాత వాసంలో ఉంటూ స్వాతంత్ర్య పోరాటానికి ఊపిరులు ఊదిన స్వాతంత్ర్య సమర యోధుల్లో ఆయన కూడా ఒకరు.

ఘన కీర్తి కలిగిన మంగపతిరావు : 1947లో ఆయన మూడు పదుల వయ సులో ఉండేవారు. ఖద్దరు ఉద్యమ సందర్భంగా 1926లో కౌతవరానికి బాపూజీ వచ్చారు. మంగపతిరావు ఆయన ప్రసంగం విన్నారు. అపుడు ఆయనకు తొమ్మిదేళ్లు. మూడేళ్ల తర్వాత 1930లో ఉప్పు సత్యాగ్రహాన్ని పురస్కరించుకుని మళ్లీ కౌతవరంలో గాంధీజీ అడుగు పెట్టారు. స్వాతంత్రోద్యమానికి బాపూజీయే తన ప్రసంగాలతో మంగపతిరావు బాల్యంలో తొలి భీజం నాటారు. స్వాతంత్ర్యోద్యమంలో భాగంగానే 1933లో కానూరి రామానంద చౌదరి ఢిల్లీలోని బాంబింగ్ కేసులో ముద్దాయిగా ఉన్నారు. ఆయన్ను అరెస్టు చేయటానికి వచ్చిన బ్రిటీషు రిజర్వు దళాలు కౌతవరంలో బీభత్సం సృష్టించాయి. పోలీసులు మంగపతిరావుతో సహా దొరికిన వారిని దొరికినట్లుగా లాఠీలతో కొట్టారు. రక్తాలు కారుతున్న ఆ గ్రామస్తుల వదనాలు చూసి, పదహారేళ్ల వయసులో వున్న మంగపతిరావుకు చాలా బాధ కలిగింది. అక్కడి నుంచే అజ్ఞాత పోరాటానికి ఆద్యం పోసినట్లయ్యింది.

ఆధ్యాత్మిక వేత్తగా : మంగపతిరావు కౌతవరం చరిత్ర మూడు భాగాలతో పాటు ఆధ్యాత్మిక రచనలు రాశారు. పరమాత్మయే పరమాణువు, అణు విజ్ఞానం,



ఆత్మతత్వం, తత్వ విచారణ, పరిచయ భారతి వంటి రచనలు చేశారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. 97 ఏళ్ల వయసులో 2014 జనవరి ఒకటిన ఆయన మృతిచెందారు.

అజ్ఞాతంలోనే ఎక్కువగా ఉండేవారు...

చల్లపల్లి చిరంజీవమ్మ, మంగపతిరావు కుమార్తె



స్వాతంత్రోద్యమంలో మా నాన్న ఎక్కువగా పోరాటంలోనే ఉండేవారు. అదీ అజ్ఞాతంలోనే ఉద్యమించేవారు. మాది అంతా తెలిసీ తెలియని వయసు. ఆయన మా ఇంటికి రావటం తక్కువే. బ్రిటీషు పోలీసులకు తెలియకుండా ఎక్కువగా రాత్రి సమయాల్లోనే చాటుగా వచ్చేవారు.

తాత బాటలోనే...

చల్లపల్లి అమరప్రసాద్, మనవడు, సినీ నిర్మాత



తాత మంగపతిరావుకు పేదలంటే ఇష్టం. పేదలంతా బాగుండాలనే పోరాటం చేసేవారు. అలాగే ఆధ్యాత్మిక పుస్తకాలు ఎన్నో రాశారు. నేను కూడా ఆయన బాటలోనే పేదలకు ఉపయోగపడే డాక్యుమెంటరీలను తీస్తున్నాను. ఆధ్మాతిక వ్యవహారాల్లో తన వంతుగా కృషి చేస్తున్నాను.



ముంపు నివారణకు చర్యలు : ఎంఎల్‌ఎ వెనిగండ్ల

ప్రజాశక్తి - నందివాడ : ప్రభుత్వ ముందస్తు చర్యల వల్ల భారీ వర్షాలు కురిసినా బుడమేరులో అవాంతరాలు లేకుండా వరద ప్రవాహం ఉధృతంగా ముందుకు సాగుతుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. మండలంలోని పుట్టగుంట వంతెన వద్ద బుడమేరులో వరద ఉధతిని అధికారులతో కలిసి ఎమ్మెల్యే రాము గురువారం పరిశీలించారు. ముందుగా బుడమేరు ఉధతికి కోతకు గురైన 216 ఎన్.హెచ్, పిఎన్పి రహదారినీ పరిశీలించిన ఎమ్మెల్యే రాము. డి.ఈ ఎన్.హెచ్ సత్యనారాయణతో ఫోన్లో మాట్లాడి రహదారికి సత్వర మరమ్మత్తులు చేపట్టాలంటూ సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడుతూ గతంలో కొద్ది వర్షాలకే బుడమేరులో వంతెన పైనుండి వరద నీరు ప్రవహించేదని, గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురిసిన, ఎగువ నుండి భారీగా వరద నీరు వస్తున్నా నాటి పరిస్థితులు ఇప్పుడు కనిపించడం లేదన్నారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, గుడివాడ జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, నందివాడ టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, డ్రైనేజీ శాఖ డీఈ నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండలం, పెదప్రోలు గ్రామానికి చెందిన వేముల వెంకటేశ్వరరావుకు మెదడులో రక్త ప్రసారంతో ఆపరేషన్ నిమిత్తం తెలుగువన్ ఫౌండేషన్ ద్వారా కంఠంనేని శివశంకర్ రూ .75 వేల రూపాయల చెక్కును ఆయన కుమారుడు రాంబాబుకు అందజేశారు. కంఠంనేని రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కళా ఉత్సవ్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : భారతదేశంలో విభిన్న జాతులు, సాంప్రదాయాలు ఉన్న అందరూ ఐక్యంగా ఉండటమే భారత్ ప్రధాన బలం అని పిఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ ఇన్చార్జి ప్రిన్సిపల్ జె.సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక పిఎం శ్రీ కేంద్రీయ విద్యాలయాలో ఏక్ భారత్ శ్రేస్ట్ భారత్‌లో భాగంగా కెవిఎస్ రాష్ట్రీయ ఎక్తా పర్వ్ 2025, కార్యక్రమం కళా ఉత్సవ్ కార్యక్రమం ఆనందోత్సహాల మధ్య గురువారం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 7 కెవిల నుండి 206 మంది విద్యార్థులు మొత్తం 14 ఈవెంట్‌లలో పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారిని ప్రాంతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. శాస్త్రీయ నత్యం, జానపద నత్యం, జానపద బంద నత్యం, దేశభక్తి గీతాలు,చిత్రలేఖనం, 2డి, 3డి కళా ఖండాలు తయారీ మొదలగు 16 రకాల అంశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమం సమన్వయకర్తలుగా వి హెచ్ కె గుప్తా,ఆర్. విజయ్ కుమార్, న్యాయ నిర్ణీతలుగా సిహెచ్ వినుకొండ, కొల్లూరి రాము, కే సిరీష్ రెడ్డి,ఎల్ విజయలక్ష్మి,డి దాక్షాయని, సిరి శిరీషలు వ్యవహరించారు.



జాతీయ విద్యా విధానంపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయంలో గురువారం 'జాతీయ విద్యా విధానం 2020"పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి కృష్ణా విశ్వవిద్యా లయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ ఎన్ఈపి 2020 ప్రధాన లక్ష్యాలను విద్యార్థులకు వివరిస్తూ బహుళశాఖా విద్య ,సమా నత్వం, సమాజానికి కలిగే ప్రయోజనాలు, నైపుణ్యాభివద్ధిపై ప్రత్యేకంగా దష్టి సారించాలన్నారు. విద్యార్థులు తమ అభిప్రాయాలను ఉత్సాహంగా వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

16 వరకు రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కవుతరం రైల్వే స్టేషన్ పరిధిలోని కవుతరం నుండి డోకిపర్రు వెళ్లే రహదారిలో మరమ్మతుల నిమిత్తం రైల్వే గేటును మూసివేశారు. ఈనెల 13వ తేదీ బుధవారం ఉదయం నుండి 16 వ తేదీ శనివారం సాయంత్రం వరకు మరమ్మతుల నిమిత్తం ఈ గేటును మూసివేస్తున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు.

నీట మునిగిన పంటలు పరిశీలన

ప్రజాశక్తి-చల్లపల్లి : ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల శాస్త్రవేత్తల బృందం స్థానిక చల్లపల్లి మండలం పరిధిలోని మాజేరు, లక్ష్మీపురం గ్రామాలలో గురువారం పర్యటించారు. అధిక వర్షాల కారణంగా మునిగిన వరి, చెరుకు పంటలను పరిశీలించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు వివిధ దశల్లో ఉన్న వరి పంట ముంపుకు గురి అయ్యే అవకాశం ఉందని కృషి విజ్ఞాన కేంద్రం, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. డి. సుధారాణి తెలిపారు. పిలకల దశలో సాధారణ రకాలు 5 రోజుల వరకు నీట మునిగినా బతికే అవకాశం ఉందని, పిలకల దశలో వరి పంట మునిగితే నీరు బయటకు తీసిన తరువాత ఎకరానికి 20 కిలోల యూరియా 20 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సస్యరక్షణ శాస్త్రవేత్త రేవతి, సస్యపోషణ శాస్త్రవేత్త వెంకట లక్ష్మీ పాల్గొన్నారు.



పలుచోట్ల పిఎసిఎస్ చైర్మన్ల బాధ్యతల స్వీకారం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని ఐలూరు శ్రీ రామేశ్వర పిఎసిఎస్ కార్యాలయం అధ్యక్షుడిగా దావులూరి వెంకటేశ్వరరావు(చినబాబు) గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా జొన్న జగన్మోహన్రావు, కమ్మిలి సాంబశివరావు ఎన్నికయ్యారు. పి ఎస్ ఎస్ మాజీ అధ్యక్షులు కడియాల శివరామయ్య, కార్యదర్శి గణేష్ బాబు, గుమ్మడి కోటేశ్వరరావు, కూరగంటి వీరబాబు, లోయ శివరామకష్ణ, గుర్రం బాపనయ్య,పిడుగు రాఘవులు తదితరులు ఎన్నికైన సభ్యులను పూలమాల బొకేలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అధ్యక్షులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు తన వంతు సేవా సహకారాలు స్వార్థం లేకుండా అందిస్తానని తెలిపారు. **ప్రజాశక్తి-గన్నవరం :** రైతుల అభ్యున్నతి కోసం విశేష కృషి చేస్తానని పీఏసీఎస్ చైర్ పర్సన్ గోట్టిపూళ్ల వీరబాబు అన్నారు. మండలంలోని సూరంపల్లి శ్రీ గాంధీ మహర్షి ప్రాథమిక సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వీరబాబు మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో ఇచ్చిన పదవికి వన్నెతెస్తానని చెప్పారు. రైతులకు సకాలంలో రుణాలను అందచేసి వ్యవసాయ అభివద్ధికి కషి చేస్తానని తెలిపారు. సర్పంచ్ ఈలప్రోలు వాసు, డైరెక్టర్ రామినీడు బసవ పూర్ణయ్య, బాల నాయక్, ఎంపీటీసీ సభ్యులు గండికోట సీతయ్య, బాణవత్ నీలిమ, పాలకేంద్రం అధ్యక్షుడు ఈలప్రోలు రాంబాబు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** రైతు సంక్షేమానికి ఆదర్శమైన సొసైటీగా చల్లపల్లి సొసైటీ నిలిపేందుకు కృషి చేస్తామని సొసైటీ చైర్ పర్సన్ బొందలపాటి వీరబాబు అన్నారు. చల్లపల్లి సొసైటీ చైర్ పర్సన్ గా నియమితులైన బొందలపాటి వీరబాబు, పర్సనల్ వేముల హరికష్ణ, ఆలూరు విశ్రాంతి కలిసి గురువారం సొసైటీలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఈవో తోట కష్ణారావు, ఏఎంసి చైర్మన్ తోట కనకదుర్గ,సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, ఉపసర్పంచ్ మమ్మనేనిరాజ్ కుమార్, కిషోర్ అంబటి భువనేశ్వర్ రావ్ షేక్ నసీం గౌరీ



చల్లపల్లి చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

తదితరులు సొసైటీ చైర్‌పర్సన్,పర్సన్ లను అభినందించారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** మేడూరు పిఎసిఎస్ చైర్‌పర్సన్‌గా గోపిశెట్టి మోహన్‌రావు నియామకంపట్ల రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ ఉదయ్‌కుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు గుళ్లపల్లి సురేష్, వీరస్వామి, శ్రీనివాసరావు,కార్యదర్శి తెల్లాకుల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ గడువు పొడిగింపు

ప్రజాశక్తి - తిరువూరు : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనధికార లేఅవుట్లలోని ప్లాట్ల క్రమబద్ధీకరణకు గడువును పొడిగిస్తూ జిఒఎమ్.ఎస్ నెం.134 ను విడుదల చేసిందని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ మనోజ తెలిపారు. దీని ప్రకారం 2025 జూన్ 30లోపు అనధికార లేఅవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉన్నా రు. అటువంటి వారు ప్రభుత్వం పేర్కొన్న విధం గా 90 రోజుల వ్యవధిలో అనగా అక్టోబర్ 24 లోపు, ఆన్ లైన్ దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. దరఖాస్తుదారులు నిబంధనలకు అనుగుణంగా తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు డిటిసిపి వెబ్ సైట్‌లో లేదా తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగంలో అధికారులను సంప్రదించాలని సూచించారు.

దుర్గగుడి అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ సిటీ :
విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దసరా మహోత్సవాల ఏర్పాట్లపై రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గురువారం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, కార్యనిర్వహణాధికారి వి.కె.శీనానాయక్‌తో కలిసి దేవస్థానంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను, ముఖ్యంగా దసరా 2025 పండుగకు సంబంధించి చేపడుతున్న ప్రధాన నిర్మాణ పనులను పరిశీలించారు. నూతన లడ్డూ పోటు నిర్మాణ పనులను పరిశీలించి, భవనం కోసం చక్కగా ప్రణాళికబద్ధమైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నూతన అన్నదానం భవన నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, దసరా కు తాత్కాలిక ఏర్పాట్లను వేగవంతం చేయాలని కోరారు. ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్‌ను తనిఖీ చేశారు. దసరా ఉత్సవాల నాటికి నూతన బిటి రోడ్డు, ఘాట్ రోడ్డు మరమ్మతులు త్వరగా చేయాలని ఆదేశించారు. మల్లేశ్వర స్వామివారి ఆలయం మెట్ల మార్గం నుండి కనకదుర్గ నగర్ ప్రవేశ ద్వారం వరకు నూతన బిటి రోడ్డు నిర్మాణం అలాగే ప్రస్తుతం ఉన్న ఘాట్ రోడ్డు మరమ్మతులకు ఆదేశాలు జారీ చేశారు.

తాత్కాలిక ఏర్పాట్లు

పండుగ ప్రారంభానికి 10 రోజుల ముందుగానే భవనాల్లో తాత్కాలిక ఏర్పాట్లను పూర్తి చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. ఈ పర్యటనలో దేవాదాయ శాఖ సి.ఇ. శేఖర్, దేవస్థానం కార్యనిర్వహణ ఇంజినీర్లు కోటేశ్వరరావు, రాంబాబుతో పాటు దేవస్థానం డి.ఇ.ఇ.లు, కమిషనర్ వెంట ఉన్నారు.

గుంతలు పూడ్చండి మహాప్రభో...

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో ప్రదాన రహదారులు గుంతలు పూడ్చటంలో నాయకులు, అధికారులకు 'చిత్తశుద్ధి' ఎక్కడ కనిపించటం లేదు. ముఖ్యంగా నందిగామ గాంధీ సెంటర్ నుండి రామన్నపేట వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమై వాహనాలు రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతుంది. వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పాత జిల్లా కోర్టు వద్ద చిన్నపాటి వర్షాలకే రామన్నపేట రహదారి పూర్తిగా జలమయమై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. వాహనాలు వెళ్లే క్రమంలో పాదచారులపై మురుగునీరు చిందిపడుతుండటంతో తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. పాత బైపాస్ రోడ్డు, గ్యాస్ కంపెనీ సమీపంలో రామన్నపేట రహదారి పూర్తిగా ధ్వంసమై పూర్తిగా గుంటలు పడి ఆటోలు, బస్సులు, స్కూలు బస్సులు, ద్విచక్ర వాహనాలు రోడ్డు దాటడానికి అనేక ఇక్కట్లు పడుతున్నారు. ప్రదాన రహదారులు గుంతలు పూడ్చటంలో ముందున్నామని పాలకులు చేస్తున్న వాగ్దానాల్లో స్పష్టత కనిపించటం లేదు. నందిగామ మున్సిపాలిటీ పరిధిలో వున్న రహదారులు గుంతలు పూడ్చటంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ముందుకు రావడం లేదు. నందిగామ మున్సిపాల్టీకి కోట్లాది రూపాయల ఆదాయం సుమారు పది కోట్లు పైబడి ప్రజలు నుండి వస్తున్న మౌలిక సదుపాయాలు కల్పించటంలో పాలకులు, అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వెలగని సెంట్రర్ లైటింగ్

నుండి రామన్నపేట రహదారి పై వున్న సెంటర్ లైటింగ్ ఏడాది కాలం నుండి వెలగటం లేదు. సెంటర్ లైటింగ్ వెలిగించడంలో పాలకులు చేయలేకపోతున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సెంటర్ లైటింగ్ వెలిగించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ చీకటిలో కుక్కలు దాడి చేసి ప్రజలను తీవ్రంగా గాయపడిన సందర్భాలున్నాయి. సెంటర్ లైటింగ్ పూర్తిగా వెలిగించడం పాలకులు, అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని ప్రజల నుండి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నందిగామలో ఎక్కడ వెలగని వీధి లైట్లు

నందిగామ పట్టణంలో గత వారం పది రోజుల నుండి వీధి లైట్లు ఎక్కడ వెలగటం లేదు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు గత వారం పది రోజుల నుండి చేస్తున్న సమ్మెను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో నందిగామలో వీధి లైట్లు ఎక్కడ వెలగటం లేదు. రాత్రివేళ పూర్తిగా అంధకారంగా మారింది.

విజయ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : స్థానిక నున్న గ్రామంలోని విజయ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ కి బి.ఉదయ్ కుమార్ కి అన్నమలై యూనివర్సిటీ చిదంబరం (తమిళనాడు)వారు డాక్టరేట్ ప్రధానం చేశారు. ఉదయ్ కుమార్ 'ఎఫెక్ట్ ఆఫ్ స్ట్రక్చర్ రెసిస్టెన్స్ ట్రైనింగ్ అండ్ ప్లేయోమెట్రిక్ ట్రైనింగ్ ఆన్ సెలెక్టెడ్ ఫిజికల్ అండ్ ఫిజియోలాజికల్ వేరియబుల్స్ అమౌంట్ త్రోవర్స్' అనే అంశంపై డాక్టర్ ఆర్ రతినకమలన్ ఆధ్వర్యంలో పరిశోధన చేసినందుకుగానూ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ ఎన్.సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ మా కళాశాల అధ్యాపకులను పరిశోధనల విషయాల్లో తాము ఎప్పుడూ వారికి సహకరిస్తూ వారి ఉన్నతికి తోడ్పడతామని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బి ఉదయ్ కుమార్‌ను అభినందించారు.

